# పోయిట్ మెడికోశ్యైవ్



రూంలో కూర్చుని కాగితాన్ని ఖరాబు చేస్తున్నాడు రాజారావు. కాగితాన్ని అందంగా ఖరాబ్ చెయ్యడమే కవిత్వం అంటాడు రాజారావు. రాజారావు రూమొక పబ్లిక్ పార్కులాంటిది. ఆవే వాలే ఆతేహై - జావే వాలే జాతే హై

రంగారావు ఆ రూంలోకి ప్రవేశించాడు.

'ఏంరోయ్ రాస్తున్నావ్?' అన్నాడు.

'పోయిట్రీ' తకీమని సమాధానం.

'దేనిమీద?'

'కాగితంమీద' మళ్ళీ తకీ

'అబ్బ అదికాదు'

'ఏది కాదు?'

'ఈ సరిగా చెప్పు' మూడ్ మారిన గొంతు.

'లావెట్రీ మీద'.

'ఛీ. అదేంటి లావెట్రీ మీద పోయిట్రీ ఏంటి?'

"ఏం? ఎందుకు రాయకూడదు? 'కాదేదీ కవిత కనర్హం' అన్నాడు మహాకవి"

'అన్నాడనుకో...'

మౌన వీణ మోగింది.

'ఏదీ చూపించు...' రంగారావు.

'ఊహూ'... రాజారావు

రంగారావు ఫేడవుట్. నిష్క్రమణ.

రాజారావు కలం నడవడం లేదు.

చేయి కదలడం లేదు.

కుర్చీలోంచి లేచాడు.

టవల్లోకి మారాడు పాంటు విప్పేసి, చెప్పులేసుకు బయల్దేరాడు.

గుమ్మం దగ్గర ఓ క్షణంలో సగం సేవు యోచించాడు.

పెదవి విరిచి వరండాలో నడిచి వెళ్ళాడు బాత్రూంస్ వైపు.

లేవట్రీ నంబర్ వన్.

మల విసర్జన జరిగింది. విసర్జన జరగలేదు. నీళ్ళు పొయ్యలేదు. ఫ్లష్ చెయ్యలేదు.

'రాస్కేల్' పళ్ళు పిండుకున్నాడు రాజారావ్.

లేవట్రీ నంబర్ టూ.

'డిటో' అంది

'ఇర్రెస్పాన్సిబుల్ ఇడియట్స్' గొంతు చించుకు అరవలేదు కాని...

లేవట్రీ నంబర్ త్రీ

'సో ఆల్సో' అంది

... నంబర్ ఫోర్ 'సోదూ ఐ' అంది.

...

... నంబర్ సిక్స్ 'మైభీ' అంది హిందీలో.

తెలుగు మాట్లాడదామని సరదాపడింది పక్క నున్న యూరినల్...

కాని రాజారావు కోపం చూసి మౌనం వహించింది.

మూత్రం ప్రవహిస్తోంది.

అదో 'షివాంబు' ఫ్యాక్టరీలా వుంది.

డ్రెయినేజ్ గొట్టంలో అడ్డుపడినట్టుంది. డ్రెయినేజి కన్నంలో సిగరెట్ పీకల మంచి వేరుసెనగ తొక్కల్దాకా 'చౌచౌ' వుంది.

రాజారావు 'రోజర్స్ థెజారిస్' చూద్దామనుకున్నాడు, స్టుపిడ్స్‌కీ, ఇడియట్స్‌కీ, రోగ్స్‌కీ... ఇంకా అలాంటి పదాలకీ పర్యాయపదాలు చూడ్డానికి.

కోపంగా తల దించుకున్నాడు, ఇలాటి నీచ మానవజన్మ ప్రతినిధిలా. ప్రతినిధిగా.

చల్లగా నీళ్ళు తగిలాయి కాళ్ళకి.

పాదాలని ప్రేమగా స్పృశిస్తూ. నిన్నటివా? మొన్నటివా?

మళ్ళీ రాజారావు టెంపరేచర్ పెరిగింది.

విసురుగా నడుస్తున్నాడు రూంకి.

పల్లెల్లో సెప్టిక్ లెట్రిన్లు కట్టిస్తే అవి మాని బయలు భూమికి పోయార్ట ప్రజలు అని రాసాడు పార్కు (Park) సోషల్ ఎండ్ ప్రివెంటివ్ మెడిసిన్ పుస్తక రచయిత.

ఉపయోగం తెలీకపోతే ఎంత గొప్పది వస్తువైనా... ఏం ప్రయోజనం?

కలెక్టరు ఆఫీసులు, పబ్లిక్ పార్కులు, మైదానాలు ప్రియ ప్రైవేటు ప్రదేశాలు.

ట్రెయినుల్లో బస్సుల్లో దర్శనమిచ్చే సుందర దృశ్యం.

ఏ.పీ. ఈజ్ ది లావెటరీ ఆఫ్ ఇండియా అన్నాట్ట మహాత్మాగాంధీ అన్నారు మా మాష్టారు.

డిగ్రీలు సంపాదించడానికి చదవగానే సరికాదు ఉద్యోగాల కోసం, కట్నాల కోసం వెలగబెట్టగానే సరికాదు.

చదువున్న ప్రతీ గాడిదకీ సంస్కారం వుంటుందా?

తీవ్రంగా ఆలోచిస్తూ తలుపు తీసాడు.

లోపల ఆకుపచ్చ రంగు బకెట్ అందాల సుందరిలా వుంది. ఆకుపచ్చ చీరలా వుంది.

అదే రంగు మగ్ ఆ సుందరి జాకెట్‌లా వుంది.

నిండా నీళ్ళు. స్వచ్ఛమైన కళ్ళలా వున్నాయి. కాదు చెక్కిళ్ళలా వున్నాయి.

[illegible] సునీత కన్పించింది.

[illegible] మళ్ళీ.

లావెట్రీ నంబర్ వన్‌లోకి మగ్‌తో ఒకటీ... రెండూ, మూడూ... నాలుగు...

అరబకెట్ నీళ్ళు ఖర్చయ్యాయి.

మరో చిన్న బకెట్‌తో నీళ్ళు తీసుకు లోపలికి వెళ్ళేడు.

ఆ వాతావరణాన్ని చూస్తే కోపం కట్టలు తెంచుకు ప్రవహిస్తోంది. తన ఒళ్ళంతా ఆవహిస్తోంది.

కళ్ళు మూసుకున్నాడు.

'సినీ నటి రేఖా కాలి చిటికెనవేలి గోరు' అదే తన క్లాసు మేటు గుర్తొచ్చింది.

నవ్వుకుంటూ ఊహల్లో అయిదు నిమిషాలు గడిపాడు 'గోరు'తో.

కళ్ళు తెరిచాడు.

'గోరు' అదృశ్యమైంది.

పైకి నడిచాడు.

బకెట్‌లోకి చూసాడు.

మూడు వంతుల నీరు ఖర్చయింది.

ఇవాళ సాయంత్రం సునీతని కలుస్తానని మాట ఇచ్చాడు.

కనీసం ముఖం కడుక్కోవాలి స్నానం సంగతెలా వున్నా.

సాయంత్రం నీళ్ళొచ్చే సూచన లేదు.

ఏం చేయడం?

'సముద్రమున పడిపోవడమా? ఉరిపోసుకు చనిపోవడమా?' కాదు.

'నీరు పోసి కడిగేయడమా? నోరు మూసుకొచ్చేయడమా?'

ఆలోచిస్తే తన ఆవేదన అర్థం చేసుకుంటే తన ఆలోచన-

పరికిస్తే తన పరిస్థితి-

ఎవడన్నా తను జస్టిఫైడే అంటాడు.

తను చేసింది సరియైనదే అంటారు.

తను సంస్కారవంతుడు కనక అంత ఆలోచించాడు.

మిగతా వాళ్ళకి తనకీ తేడా ఆ సంస్కారమే.

మానవుడు పరిస్థితుల చేతిలో బానిస. కాని సంస్కారం కూడా పరిస్థితులకి బానిసే.

సాయంత్రం - సునీత -

మగ్గునీళ్ళు - మొఖం కడుక్కోవడం -

ఒయ్యారం ఒలకడం -

తన సంభాషణ -

పద రూముకి.

పోతే పోనీ

గాయత్రీ

పోయెట్రీ

లేవట్రీ.

(వస్తువు అసహ్యాకరంగా వుంటే విసిరెయ్యగలం. జీవితం అసహ్యాకరంగా వుంటే విసిరెయ్యలేం. విడిచెయ్యలేం)